# ఇత్తడి బిందె

మనుషులు కొందరు అసూయపడ్తారు తమకన్న పెద్ద హోదాలో ఉన్నవారిని చూసి, భోగభాగ్యాలతో తులతూగుతున్న వారిని చూసీ. ఆడవాళ్లలో ఈ అసూయపాలు మరికాస్త ఎక్కువగా ఉంటుంది. ఒక ఆడది నలుగురి మధ్యకి వెళ్లిందంటే తన అందాన్ని, తెలివితేటల్ని, ఐశ్వర్యాన్ని ఎదుటి స్త్రీలతో పోల్చుకుని గర్వపడ్డమో, అసూయ పడ్డమో విధిగా చేస్తుంది. అలా చెయ్యకపోతే ఆ వ్యక్తి ఆడదే కాదు అని చెప్పొచ్చు.

ఎంతటి స్థితిమంతురాలైనా సేఠ్ చమన్‌లాల్ భార్య సర్వమంగళ కూడా ఆడదే. అందుకే మనవాళ్లయ్య పెళ్లాం మల్లిని చూసి అసూయపడింది. మనవాళ్లయ్య ఏ గవర్నరో, మినిస్టరో, గ్లామరున్న సినిమా స్టారో, కనీసం జ్ఞానపీఠ్ అవార్డు అందుకొన్న ప్రఖ్యాత రచయితో అయితే సర్వమంగళ అసూయపడ్డా బాగుండేది. పోనీ మల్లి అందాలరాసో, అజంతా సుందరో అయితే అందులోనైనా కొంత అర్థం ఉండేది. సర్వమంగళ అసూయకి ఈ రెండింటిలో ఏ ఒక్కటికారణమైనా అదొక వార్తా కాదు, దానికో కథా ఉండదు.

మనవాళ్లయ్య సేఠ్ చమన్‌లాల్ బంగళాకి చౌకీదారు. ఆ నౌకరీ అయినా సర్వమంగళ జాలి తలచి స్వయంగా ఇప్పించిందే! ఆ కృతజ్ఞతతో ఆమె కాలి కింద చెప్పులా నమ్రతగా పడి ఉండే మనవాళ్లయ్య భార్యని చూసి సర్వమంగళ అసూయ పడ్డమేమిటి?

అదే ఆడదాని మనసులోని మహా చిత్రం. వారికే కాని ఇతరులకి అంతుపట్టని విచిత్రం. వారు ఎప్పుడు దేనికి విలువ ఇస్తారో, దేనిని విసిరిగొడ్తారో వారిని పుట్టించిన బ్రహ్మదేవుడు కూడా చెప్పలేడు.

నవంబరు నెలలో ఒక సాయంకాలం సిటీ బస్సులో ప్రయాణం చేస్తూ సర్వమంగళ మల్లిని మొదటిసారిగా చూసింది. కోటీశ్వరుడు సేఠ్ చమన్‌లాల్ భార్య బస్సులో ఎందుకు ప్రయాణించవలసి వచ్చిందంటారా? అయితే ఈ విధమైన కప్పదాట్లుతో ఫలితం లేదు. కథ మొదటి నుంచి చెప్పవలసిందే మరి.

అప్పటికి దీపావళి పండుగ నాలుగు రోజులు ఉంది. ఆ సాయంకాలం భార్యా భర్తలిద్దరూ బజారుకి వెళ్లి పండుగకి కావలసిన బట్టలు, పాతలు, నగా నట్రా కొనుక్కు రావాలనుకున్నారు. అంతా సిద్ధం చేసుకొని బైలుదేరబోయే సమయానికి బొంబాయి నుంచి కొందరు వర్తక ప్రముఖులు వచ్చి చమన్‌లాల్‌తో మాటలకి తగులుకొన్నారు. ఆ మాటల్లో డబ్బు జలపాతంలో నీళ్లలా పొంగుకొస్తుండడంతో సేట్‌కి కదలబుద్ధి కాలేదు. డబ్బు దగ్గరికి వస్తే తాళి కట్టిన పెళ్లాన్ని పరాయివాడి పక్కలోకి పంపడానికి కూడా వెనుతియ్యడు సేఠ్.

సర్వమంగళకి ఇటువంటి ఆశాభంగాలు అలవాటే.

"పోనీలెండి రేపు వెళదాం" అంది నిర్లిప్తతగా.

"పక్కన నేనున్నా ఎంపిక నీదేకదా, మానేయక వెళ్లిరా. రేపు ఆదివారం షాపులుండవు" అన్నాడు చమన్‌లాల్ భార్యని బుజ్జగిస్తూ.

ఒంటరిగా బజారుకి వెళ్లి షాపింగ్ చెయ్యాలనే కోరిక పెద్దగా లేకపోయినా ఇంట్లో కూర్చోడం విసుగనిపించి బైలుదేరింది సర్వమంగళ. ఆమె ఒంటరిగా ఎప్పుడు బైటకు వెళ్లినా స్వయంగా కారు నడుపుకొంటుంది. బాడీగార్డులా డ్రైవరు ఒకడు వెంట ఉండటం ఆమెకి ఇష్టముండదు.

పండుగ ముందు బజారంతా మనుషులతో కిక్కిరిసి వుంది. రంగు కాగితాల తోరణాలు, రంగురంగుల దీపాలు, సరుకులతో నిండుగా కలకల్లాడే షాపులు, చూడ ముచ్చటగా ఉంది బజారు. సర్వమంగళ ఒకటికి నాలుగు షాపులు తిరిగి తను కొనాలనుకొన్న వస్తువులన్నీ కొంది. చివరగా నగలషాపు లోంచి బైటికి వచ్చి కారు స్టార్ట్ చెయ్యబోతే కదలనని మొండికేసింది కొత్త కారు. ఆ షాపు యజమాని స్వయంగా వచ్చి పురుష ప్రయత్నం చేసినా అది లొంగి రాలేదు.

"పక్కసందులో ఒక మెకానిక్ ఉన్నాడు. పిలిపిస్తాను. మీరు లోపలికి వచ్చి కూర్చోండి" అన్నాడు అతడు వినయంగా.

మళ్లా లోపలకి వెళ్లి కూర్చోవడం సర్వమంగళకు ఇష్టంగా లేదు.

"నాకు బజార్లో ఇంకా కొంచం పని మిగిలి వుంది. అది చూసుకు వస్తాను. ఈలోగా కారు సిద్ధమయేలా చూడండి" అంటూ ముందుకి నడిచింది.

అలా ఒంటరిగా బజారులో పేవ్‌మెంట్ మీద నుంచి నడుస్తుంటే ఆమెకి ఒక తమాషా అయిన కోర్కె పుట్టింది. కిక్కిరిసిన మనుషుల మధ్య తానూ ఒకతెగా సిటీ బస్సులో ప్రయాణించాలని. ఆమె మనసులోని కోరిక ఏ దేవుడో పసికట్టి పంపినట్లుగా పక్కగా వున్న స్టాపులో ఒక బస్సు వచ్చి ఆగింది. ఆ బస్సులో ఎప్పుడూ ప్రయాణించక పోయినా అది తమ యింటివేపు పోతుందన్న సంగతి ఆమెకి తెలుసు. రోజూ ఉదయం ఎనిమిది గంటల వేళప్పుడు ఆ బస్సు కోసం ఎదురు చూస్తూ బాల్కనీలో నిల్చోడం ఆమె దినచర్యలో ఒక భాగం. ఆవేళప్పుడు వారి బంగళాకి ఎదురుగా వుండే స్టాపులో ఆగే ఆ బస్సులోంచి బిలబిలమంటూ ఒక పాతిక ముప్ఫయి మంది పిల్లలు దిగుతారు. చిట్టి ఫ్రాకులవాళ్ళు, పొట్టి లాగులవాళ్ళు, మినీ స్కర్టుల వాళ్ళు, లంగా జుబ్బాలవాళ్ళు అప్పుడే తోటలో విచ్చిన పువ్వుల్లా, ఆకాశంలో మొదటిసారిగా రెక్కలల్లారుస్తూ ఎగిరే పక్షుల్లా. ఆ పక్కవీధిలో ఒక కిండర్‌గార్డెన్ స్కూలు ఉంది. ఆ పిల్లల్ని చూస్తుంటే, తనూ తమ్ముళ్లూ బస్సులో ఎక్కి స్కూలుకి పోయిన రోజులు గుర్తుకి వస్తాయి ఆమెకి.

బస్సు వచ్చి స్టాపులో ఆగింది. పక్కనున్న పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లోంచి నగల షాపు యజమానికి కారు సిద్ధమయితే వాళ్ల డ్రైవరునిచ్చి ఇంటికి పంపేయమని ఫోను చేసి

వచ్చింది. మందిని తోసుకుంటూ అలా బస్సులో ఎక్కడం ఆమెలో అదో విధమైన వింత అనుభూతిని కలుగజేసింది. తన జీవితకావ్యంలో చిరిగిపోయిన ఒక పుటని అంటించి, తిరిగి చదువుకొంటున్నట్లనిపించింది.

తనిప్పుడు ఇనప్పెట్టెల్లో లక్షలు నలుపూ, తెలుపూ రూపాయలు మూలుగుతున్న సేఠ్ చమన్‌లాల్ భార్య కాదు. ఇంతమంది ప్రయాణీకుల్లో తనూ ఒక వ్యక్తి. వారందరి లాగే టిక్కెట్టు కొనుక్కొని, చోటు దొరికితే కూర్చుని, లేకుంటే నిలుచుని ప్రయాణం చేస్తుంది. ఈ ఆలోచన ఆమెకి ఎంతో ఉత్సాహాన్నిచ్చింది.

"ఆయమ్మకి చోటివ్వండి... కాస్త పక్కకి తప్పుకోండి" అంటూ కండక్టర్ ఆమెకి దారి చేసాడు. తానెంత కాదనుకున్నా కట్టిన బట్టలు, పెట్టిన నగలూ తన ఆధిక్యతని చూపించక మానవు. కండక్టర్ ప్రత్యేక శ్రద్ధకి, ఏమో ఏ పుట్టలో ఏ పాముందో అన్న సంశయం కారణం కావచ్చు. అతడు చూపించిన సీటులో సర్దుకొని కూర్చుని ఇటు అటు పరిశీలనగా చూసింది.

ఆమెకి పక్కగా ఉన్న సీటులో ఒక కాలేజీ అమ్మాయి కూర్చుంది. రెండు జడలు, చేతిలో బొత్తెడు పుస్తకాలు. ఆకర్ణాంతం దిద్దిన కాటుక రేఖలు. కలల్లో తేలిపోతున్నట్లున్న అరమోడ్పు కన్నులు. ఒకానొకప్పుడు తనూ అలాగే ఉండేది. ఆ వయసులో ఉన్న ఆడపిల్లల కళ్ళ ముందు జీవితం ఎంతో సుందరంగా అప్పుడే విచ్చుకొంటున్న సంపెంగలా సువాసనలు వెదజల్లుతూ ఉంటుంది.

ఆ పిల్లకి ఎదురుగా యాభై ఏళ్లు పైబడ్డ నాయురాలు ఒకతె కూర్చుంది. నాయురాలు చెవులకి నాటుకోళ్ళు, ముక్కుకి సత్తు కమ్మి. నోట్లో పొడుగాటి చుట్ట.... చుట్ట చివర పైకి కన్పిస్తున్నది. నిప్పుండే భాగం నోట్లో ఉంచుకొని అడ్డపొగ పడ్తున్నది. ఉండుండి నోరు తెరచి పొగ పైకి వదులుతుంటే కాలిన కడుపులోంచి తోసుకొస్తున్న ధూమంలాఉంది. ఎదురుగా కూర్చున్న కాలేజీ అమ్మాయి ఆ పొగకి తట్టుకోలేక ముఖానికి పుస్తకం అడ్డు పెట్టుకొని "పొగ తాగకూడదు" వంటి బోర్డు ఏదైనా ఉందేమో ఆ నాయకురాలితో దెబ్బలాటకి దిగుదాం అని ఇటూ అటూ చూసింది. "హరేరామ హరేకృష్ణ, చేతులు బైటికి ఉంచరాదు" వంటి మాటలు కన్పించాయి. కండక్టర్ వంక చూసింది. ఆఖరి దమ్ము లాగి బీడీని బస్సు కిటికీలోంచి బైటకు గిరవాటు పెట్టి బ్యాగ్‌లోంచి టిక్కెట్ల పుస్తకం తీశాడు.

ఒక్కొక్కర్నీ దిగవలసినచోటు అడిగి టిక్కెట్లు చింపియిస్తూ సర్వమంగళ దగ్గరకు వచ్చాడు. ఆమె తను దిగవలసిన చోటు చెప్పింది. ఒక్కసారి ఆమె ముఖం వైపు చూసి టిక్కెట్టు చింపి ఇచ్చాడు. రోజూ తమ యింటి ముందు నుంచి వెడుతుండే బస్సేకదా! క్రమం తప్పకుండా బాల్కనీలో నిలచి చూసే తన ముఖంగాని గుర్తు పట్టాడేమో? డబ్బున్న వాళ్ళకి ఉండేంత పిసినారితనం ఇంకొకరికి వుండదు. లేకుంటే హాయిగా కారులోనో టాక్సీలోనో పోక ఈవిడకి యిదేం బుద్ధి అనుకుంటున్నాడేమో?

ఆమె తన ఆలోచనల్లో ఉండగానే పక్కస్టాపులో బస్సు ఆగింది. కొందరు దిగారు, మరికొందరు ఎక్కారు. ఎక్కినవారిలో ఒక అమ్మాయి వుంది. అమ్మాయంటే మరీ బొత్తిగా చిన్నపిల్ల కాదు. ఇరవై ఇరవై అయిదు మధ్యలో వుంటుంది వయసు. ఎంతో ఉత్సాహంగా, గర్వంగా తానొక రాజ్యానికి రాణిని అన్నంత హుందాగా నడచి వచ్చి సర్వమంగళకి కొద్దిపాటి దూరంలో నిలిచింది. ఆమెను చూసిందే తడవుగా అక్కడ అంతకుపూర్వం కూర్చున్న వ్యక్తి లేచిపోయి సీటు యిచ్చాడు. ఏమిటా యీ పిల్లలో ప్రత్యేకత అని పరిశీలనగా చూసింది సర్వమంగళ. ఆ పిల్లలో ప్రత్యేకత కాదు. అది స్త్రీల కోసం ప్రత్యేకంగా కేటాయించిన సీటు. ఆడవాళ్లకి మొగవాళ్లతో సమానమైన హక్కులూ, అవకాశాలూ ఉండాలంటూ వాదిస్తారు. మళ్లా యిటువంటి ప్రత్యేక సదుపాయాల దగ్గరికి వచ్చేసరికి మేము 'అబలలం, ఆడవాళ్లం' అంటూ అంది పుచ్చుకొంటారు. "ఎంతిచ్చి కొన్నావేటి?" ఎదురుగా కూర్చున్న నాయురాలు నోట్లో చుట్టని తీసి చేత్తో పట్టుకొని అప్పుడే వచ్చి కూర్చున్న ఆ పిల్లని అడుగుతున్నది. ఏమిటా కొన్న వస్తువు? కుతూహలం కొద్దీ అటు తిరిగి చూసింది సర్వమంగళ.

అప్పుడే కనిపించింది ఆ పిల్ల కాళ్ల ముందర ఉన్న ఇత్తడిబిందె. కింద నల్లగా, లోపల ఎర్రగా, చుట్టూ పచ్చగా అప్పుడే దుకాణదారు చెర విడిపించుకొని బయట ప్రపంచంలో కాలు పెట్టిన ఇత్తడి బిందె.

"ముప్పయ్" ధర చెప్తున్నప్పుడు ఆ పిల్ల కళ్ళల్లో వెయ్యి వాట్ల బల్బులు జంటగా వెలిగాయి. ఇంత విలువైన వస్తువు నేను కాబట్టి కొన్నాను అన్న గర్వం ఆ కళ్లల్లో ఆ క్షణంలో ప్రతిఫలించింది.

"ఓలమ్మో?" అంది ఆ పక్కనున్న ముసిలిది రెండు చేతుల దవడలు నొక్కుకుంటూ.

"అవుతాది. ఇత్తడి సానా పిరిం" అన్నాడు ఆమె పక్కనున్న ముసలాడు.

"మూతెట్టిన పళ్లెమో?" ఎదుటినించి ఇంకెవరో అడిగారు.

"రెండూ కలిపే" అంది ఆపిల్ల.

"కూంత నయం" 'ఓలమ్మో' అన్న ముసలిది ఆమాట విని తృప్తి పడింది.

"ఈరోజుల్లో ఇరువై, ముప్పయ్ అనుకోడమేగాని డబ్బుకి విలువేటుంది! దోసెడు రూపాయలు పోత్తే దోసెడు బియ్యం అమ్మేకాలం వత్తాదని ఈరబెమ్మంగోరు పదాల్లో యెప్పుడో రాసేసినారు. అప్పుడు కలిదేవుడు పుట్టి...."

ముసలాడి మాటల్ని ఆడాళ్లు వినిపించుకోడం లేదు. వీరబ్రహ్మంగారు పదాలలో ఏం చెప్పారో, ఏం రాసారో? కలిదేవుడు పుట్టి ఏం చేస్తాడో? అప్పుడు వాళ్లకి పట్టలేదు. ఎదురుగా అప్పుడే కొన్న ఇత్తడి బిందె ఉంది. దాని నాణ్యత, తూకం, వెల ఇత్యాది విషయాలమీదే వారి మనసు లగ్నమై ఉంది.

ఒకరు దాని పనివాడితనం పరికిస్తున్నారు. ఇంకొకరు అడుగు మందంగా వుందా లేదాని తనిఖీ చేస్తున్నారు. మరొకరు అంచులు వొంపులు, పళ్ళెం మీది లతలు పరిశీలనగా చూస్తున్నారు.

"బిందె బాగుంది. ధర కూడా సరిగానే ఉంది" అని ఎవరైనా అంటే ఆ పిల్ల ధైర్యంగా మాట్లాడుతున్నది. తనెంత నేర్పుగా బేరంచేసి ఆ బిందె కొన్నదో వివరిస్తున్నది. అలాకాక ఎవరైనా వాళ్ల నాయనమ్మ పెత్తల్లి మనవడి పెళ్ళాం సరిగ్గా ఇలాంటిదే ఈ మధ్యనే ఇరవయ్యికో, పాతిక్కో కొంది అని చెపితే, 'అయ్యో! నిష్కారణంగా నష్ట పోయానే' అని బాధపడుతున్నది.

ఈ అలజడి ఏమిటా అని ఒకటి రెండుసార్లు బస్సు డ్రైవర్ కూడా వెనుతిరిగి చూసాడు. ఇటూ అటూ తిరుగుతూ తెరిపి లేకుండా టిక్కెట్లు చింపి యిచ్చే కండక్టరు కూడా ఒకసారి బిందెని చేత్తో పట్టుకొని పరిశీలించకుండా ఉండలేకపోయాడు. "బరువుగానే వుంది. ఎంత లేదన్నా...." అతడు ఆలోచించి తూకం చెప్పేలోపునే ఎవరో ప్రయాణీకుడు వచ్చే స్టాపులో దిగడానికి సిద్ధంగా లేచి నిలబడ్డాడు. బిందెని దిగవిడచి కండక్టర్ బస్ టాపు అదిరేలా 'దబ్'మని చరుపు వేసాడు.

బస్సు ఆగింది. కొందరు దిగారు. మరికొందరు ఎక్కారు.

"కొత్తదేనేటి బిందె, ఎంతిచ్చికొన్నాయేటి?" మళ్లా కథ మొదలు.

వాళ్ల మాటలన్నీ ముచ్చటగా వింటూ కూర్చుంది సర్వమంగళ. ముప్పయి రూపాయల ఇత్తడి బిందెని చూసి బస్సు బస్సంతా ఇంతగా గింజుకుపోతున్నారు. ఆ పిల్ల ఇదేదో మహద్భాగయం అన్నట్లు అదికాస్తా తనకే పట్టినట్లు మురిసిపోతున్నది. తను అరగంట క్రితం కొన్న అరవై వేల రూపాయల రవ్వల నెక్లెస్ బాగ్‌లో నుంచి తీసి చూపిస్తే? వెల చెప్పి లాభమా నష్టమా తేల్చి చెప్పమంటే? కప్పల్లా అరుస్తున్న ఈ మనుష్యుల నోళ్లన్నీ ఒక్కసారిగా మూతపడిపోతాయి. కర్రబొమ్మల్లా తన వంక చూస్తూ ఉండిపోతారు. పొరపాటున ఇంకో మందలో జంతువు తమ మందలో చేరిపోయిందన్నట్లు తన వంక కొత్తగా చూస్తారు.

ఆ మాటా నిజమే! తనిప్పుడు ఈ మందలో జంతువు కాదు. కానీ, ఒకానొకప్పుడు తనింకా మిసెస్ చమన్‌లాల్ కాకపూర్వం ఈ మందలోనే ఉండేది. వీరందరిలాగే నర్సింగ్ హోంకి వెళ్లడానికి బస్సులోనే ప్రయాణించేది. ముప్పయి రూపాయల బిందె కాకపోయినా ముప్పయి రూపాయలు పెట్టి ఒక చీరె కొనుక్కోవాలంటే మూడు పుంజీలమార్లు ఆలోచించేది. తెగించి కొన్నాక దానిని అందరికీ చూపించి ఆరు పుంజీలమార్లు ఆనందించేది. అప్పటికి ఈ చమన్‌లాల్ ఎవరో, ఈ జీవితం ఏమిటో తనకి తెలియదు. తను రంగరాజన్ నర్సింగ్ హోమ్‌లో నర్సుగా ఉంటున్నప్పుడే తొలిసారిగా చమన్‌లాల్‌తో పరిచయం. అప్పట్లో ఏదో సుస్తీగా ఉండి రెండు మూడు వారాలపాటు అక్కడ ఉన్నాడు. ఆ సుస్తీ ఏమిటో ఇప్పుడు గుర్తులేదు. నిజానికి డబ్బున్నవాళ్లకి నర్సింగ్ హోమ్‌లో చేరడానికి

పెద్దగా జబ్బులంటూ ఉండనక్కరలేదు. వ్యాపార నిర్ణయాలు పది రోజులపాటు వాయిదా వెయ్యాలని వున్నా, వయసులో వుండే నర్సులచేత సేవలు చేయించుకోవాలనే కోరిక కలిగినా ఏదో మిషపెట్టుకొని చేరిపోతుంటారు. వాళ్లు రెండు వారాలు అనుకొని వస్తే, ఆ సాకూ ఈ వంకా చెప్పి మరి రెండు వారాలపాటు వారిని కదలకుండా చేసి బిల్లు రూపేణా పిండగలిగినంత సొమ్ము అటువంటివారి నుండి పిండుకుంటారు డాక్టర్లు.

మూడు వారాలపాటు తన సేవలందుకున్న సేట్ చమన్‌లాల్ వెళ్లిపోయేముందు తన మనసులో మాట బయటపెట్టాడు. అంతకి పూర్వం కూడా సమయమూ సందర్భం ఉన్నా లేకపోయినా తన పనిని, మాటని ఊరికే మెచ్చుకొంటూ, “మీరు ఎంత తియ్యగా మాట్లాడుతారు? ఎంత అందంగా నవ్వుతారు! నర్సింగ్ హోమ్స్‌లో నర్సులంతా మీలాగే ఉంటే నావంటి బాదరబందీలు లేనివారు ఇళ్లు వదలి నర్సింగ్ హోమ్స్‌లోనే కాపురాలు పెట్టే ప్రమాదం వుంది” అనేవాడు. అతడి పొగడ్తకి ఉబ్బి తబ్బిబ్బవకపోయినా మర్యాద కోసం, “థాంక్సు” అంటూండేది తను. పాపం ఏదో ముసలివాడు, వయసులో వున్న పిల్ల కదాని ముచ్చటపడి మాటలు కలుపుతున్నాడు. ఈ నాలుగు రోజుల భాగ్యానికి అతన్ని చీదరించుకుంటే తన ఒడిలో ఒరిగేదేముంది అన్న భావం తప్పిస్తే అతనిపట్ల తనకు మనసులో ఇంకో ఆలోచన లేదు.

“ఇప్పుడు వెంటనే చెప్పనక్కర్లేదు. ఆలోచించుకుని రేపు చెప్పండి” అన్నాడు శేఠ్ తన కార్డు బల్ల మీద వదలిపోతూ.

ఆ రాత్రల్లా ఆలోచించింది తను. సేట్‌ని పెళ్లి చేసుకోవడమా మానడమా అని కాదు, ఈ ముసలాడు ‘హరీ’ మంటే ఎంత సొమ్ము చేతిలో పడే అవకాశం ఉంటుందని.

చమన్‌లాల్‌కి ఒక కొడుకూ, ఒక కూతురూ వున్నారు. ఇద్దరూ పెద్దవాళ్లే. కొడుకు భిలాయ్‌లో చీఫ్ ఇంజనీర్‌గా ఉంటున్నాడు. కూతురు బికనీర్‌లో అత్తవారింట భర్తతో సలక్షణంగా కాపురం చేసుకొంటూ ఉంది.

భార్య పోయి పదేళ్లకి పైగా అయినా చమన్‌లాల్ తిరిగి పెళ్లి చేసుకోలేదు.

“నిన్ను చూసేవరకు తిరిగి పెళ్లి చేసుకోవాలనే ఆలోచనే మనసులోకి రాలేదు. నీలో ఏ శక్తి ఉందో కాని అలనాడు తపోనిష్ఠలో ఉన్న వశిష్ఠుణ్ణి మేనక కదిలించి నట్లు...”

ఆ ముని వశిష్ఠుడా? విశ్వామిత్రుడా? అని శేఠ్‌కి సందేహం వచ్చినట్లు ఉంది వాక్యం పూర్తి చెయ్యకుండా నవ్వేసి ఊరుకొన్నాడు.

పుట్టినప్పటినుంచి దరిద్రం ఎంత ఘోరంగా, జుగుప్సాకరంగా ఉంటుందో అనుభవించి తెలుసుకొంది తను. ఈ దెబ్బతో తన జీవితానికి పట్టిన ఆ పీడ వదలి పోవాలనుకొంది. శేఠ్ వయసు ఏభై అయితేనేమి, అరవై అయితేనేమి? అతడి ఆస్తి కొన్ని కోట్లు ఉంటుంది. అంతా కాకున్నా కొంతైనా తన చేతిలో పడ్తుంది. డబ్బుతో పొందలేని జీవితం, అందుకోలేని ఆనందం ఏముంటుంది అనుకొంది నిశ్చలంగా.

డబ్బుతో అందుకోలేని జీవితం, ఆనందం ఏముంటుందనుకొంది అప్పుడు, ఇప్పుడు డబ్బు తప్ప జీవితంలో ఇంకేం మిగలనప్పుడు తెలియవచ్చింది. ఆ డబ్బుకి గడ్డిపోచ విలువలేని జీవితం మనిషి బ్రతుకులో ఇంకెంతో ఉంటుందని.

తను సంతోషంగా ఉండడం కోసం, నవ్వుతూ ఇంట్లో తిరుగాడ్డం కోసం శేర్ ఎంతైనా సొమ్ము ఖర్చు చేస్తాడు. అతడి ఇంట్లో ఎన్నో విలువైన వస్తువులున్నాయి. కొన్ని అవసరానికి, మరికొన్ని అలంకరణకి. ఆ విలువైన వస్తువుల్లో తనూ ఒకతే! సాటివారిలో పేరు నిలవడానికి శేర్‌కి కార్లు, రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషనర్లు, పచ్చనితోట మధ్య పెద్ద బంగళా. గేటుదగ్గరో దర్వాను ఎంత అవసరమో, అందమైన పెళ్లాం కూడా అంతే అవసరం.

"అమ్మగారూ..... మీ స్టాపు వచ్చింది" అంటూ కండక్టర్ ఒకటికి రెండుసార్లు హెచ్చరించే దాకా తను బస్సులో ప్రయాణిస్తున్నట్లు, ఒకచోట దిగవలసి ఉన్నట్లు గుర్తేలేదు ఆమెకి. బస్సు దిగుతూ ఇత్తడి బిందె అమ్మాయి కోసం ఒకసారి చూచింది. ఆ పిల్ల అక్కడ లేదు. సర్వమంగళ తన ఆలోచనల్లో ఉండగా ఎక్కడో దిగిపోయింది.

తనలా బస్సులో రావడం ఎవరైనా చూసి ఉంటారా, అని కంగారుతో ఇటూ అటూ చూసింది. రోజూ ఆరు గంటలకల్లా టంచన్‌గా వచ్చే చౌకిదార్ ఇంకా రాలేదు. దర్వాన్ ఇంటికి పోయే ప్రయత్నంలో ఉన్నాడు. మిగిలిన పరివారం అంతా ఏదో తొందరపనిలో ఇంట్లో ఇటు అటు పరుగులు పెడ్తున్నారు.

ఆ తొందరపని ఏమిటో ఆమెకి ఇంట్లో కాలుపెట్టాక తెలిసింది. అత్యవసర పనిమీద ఆ సాయంకాలం ఫ్లయిట్‌లో శేర్ బొంబాయి వెళ్తున్నాడు.

"ఇంత ఆలస్యం చేసావేం? నీకోసమే చూస్తున్నాను" అన్నాడు చమన్‌లాల్ ఆమెని చూడగానే.

"కారు స్టార్ట్ కాలేదు."

"ఆ కొత్త కారు తిన్నగా లేదు. తీసుకు వెళ్ళొద్దంటే విన్నావు కాదు. అటువంటప్పుడు డ్రైవర్ని వెంటబెట్టుకు వెళ్లవలసింది."

ఆమె మాట్లాడలేదు. అతడు కారులో ఎక్కి కూర్చున్నాడు.

"ఎల్లుండికల్లా తిరిగి వస్తాను."

పక్కగా ఉన్న మాలతీలత తల ఊపింది.

డ్రైవరు స్టీరింగ్ ముందు కూర్చున్నాడు. కారు పరుగు అందుకొంది. పోర్టికోలోంచి గేటుగుండా బాణంలా దూసుకుపోయింది.

కారు వెళ్లినవైపు నిర్లిప్తతగా చూస్తూ ఉండిపోయింది సర్వమంగళ. చేతిలో ఉన్న హేండ్ బ్యాగ్, అందులో అరవై వేలు పెట్టి కొన్న రవ్వల నెక్లెస్ బరువుగా అనిపించాయి. అంతకన్న భారంగా అనిపించింది ఆ క్షణంలో జీవితం. లోపలికి వెళ్లి విసురుగా బ్యాగ్‌ని టేబుల్

మీద విసిరి, సోఫాలో వాలిపోయింది. భారంగా నిట్టూరుస్తూ కళ్లు మూసుకొంటే బస్సులో ఇత్తడి బిందె అమ్మాయి గుర్తుకొచ్చింది.

ఆ పిల్ల కూడా ఈసరికి ఇల్లు చేరి ఉంటుంది. తను ఎంపిక చేసికొన్న ఇత్తడి బిందెని మొగుడికి, ఉంటే అత్తమామలకి ఇంకా ఇరుగు పొరుగు వారికీ గర్వంగా చూపిస్తుంది. వారు దానిని ఒకటికి పదిసార్లు చూసి మెచ్చుకొంటారు. లాభనష్టాలు లెక్కలు వేస్తారు. ఇంట్లోకి ఒక విలువైన వస్తువు వచ్చిందని మురిసిపోతారు. ఇంతా చేస్తే ఆ ఇత్తడి బిందె ఖరీదు ముప్ఫయి రూపాయలు, అయినా అది ఎంతమంది పొగడ్తలు అందుకుంటుంది! ఎంతమందికి ఆనందం పంచి ఇస్తుంది! తనూ కొన్నది ఒక వజ్రాల హారం. వేలకి వేలు విలువ చేసే వస్తువు. కాని కావాలని కొనుక్కొన్నా తనకి తృప్తి లేదు. కొనుక్కోమని చెప్పిన ఆ భర్తకి ఆ విషయమే గుర్తులేదు.

ఎంత చైతన్యరహితమైన జీవితాలు తమవి! ఏ ఒక్క విషయానికైనా మనసు నిండుగా ఆనందించలేనంతగా ఎలా మోడుబారి పోయాయి ఈ బ్రతుకులు? నవ్వితే నటన, ఏడుస్తే నటన, ఆప్యాయతలోలకపోస్తే నటన, ఆదర్శాలు వల్లిస్తే నటన! చివరికి మనిషి మనుగడకే అత్యంతావశ్యకమైన తిండి తినడం, నిద్రపోవడం కూడా నటనగానే తయారై పోయాయి. దినచర్యలో నటనతో నిండిపోయిన ఈ బ్రతుకుల్లో తప్పిదారి ఎప్పుడైనా నిజమైన ఒక అనుభూతి అందుకోగలిగినా 'అదికూడా నిజం కాదేమో!' మనసు కల్పించిన భ్రాంతేమో అన్న సందేహంలో పడిపోయేంతగా మలినమయేయి నాగరికత ముసుగులు కప్పుకొన్న తమలాంటి వారి బ్రతుకులు.

"అమ్మగారూ! కాఫీ తెమ్మంటారా?" వినయం ఉట్టిపడేలా చేతులు కట్టుకొని, తను కాఫీ తాగితే వాడి జన్మ తరిస్తుంది అన్నట్లు పోజుపెట్టి అడిగాడు బేరర్.

ఇటువంటి ఇళ్లల్లో పనిచేసే నౌకర్లకి కూడా నటన బాగా అలవాటైపోతుంది. లేకుంటే వారి పొట్టగడవదు. ఇంత వినయం చూపిస్తున్న ఈ బేరర్‌ని ఈ రోజు పనిలోంచి తీసేస్తే, రేపు తన శత్రువులు కూడా తనపై చేయలేనంత దుష్ప్రచారం చెయ్యడానికి వెనుతియ్యడు.

"అక్కర్లేదు" కసిరినట్లు గట్టిగా జవాబు చెప్పింది. తనమాట తనకే కటువుగా వినిపించింది.

అమ్మగారి అకారణ ఆగ్రహానికి హడలిపోతున్నట్లు వణికిపోతూ (అదికూడా నటనే!) వెనుతిరిగి వెళ్లిపోయాడు బేరర్.

"చౌకీదార్ వచ్చాడా?"

వెళ్తున్నవాడల్లా ఆగి "ఇంకా రాలేదు" అన్నాడు బైటికి చూస్తూ.

"రాగానే నా దగ్గరికి పిలుచుకురా."

ఈ క్షణంలో మనసులో పేరుకొన్న కోపం, కక్ష ఎవరి మీదో ఒకరి మీద తీర్చుకొంటేనే కాని మనసు శాంతించేలా లేదు ఆమెకి. మరుక్షణంలోనే వచ్చాడు మనవాళ్లయ్య. గేటు

ముందరే ఎదురుపడి చెప్పాడు బేరర్. అమ్మగారి ఆగ్రహానికి ఇంధనం కానున్న ఆ అల్పజీవి అడుగులో అడుగు వేసుకొంటూ కసాయివాడి వద్దకి కన్నితాడు పట్టుకు తీసుకుపోతున్న జంతువులా బేరర్ వెనువెనకనే హాలులోకి వచ్చాడు.

"ఇప్పుడు టైం ఎంతయిందో తెలుసా?" తీక్షణంగా చూస్తూ ప్రశ్నించింది సర్వ మంగళ.

"మన్నించాలి...." మనవాళ్లయ్య నోటిలోంచి మాట రాలేదు. మంచి చలికాలంలో తెల్లవారుజామున చన్నీళ్ల స్నానం చేసి తడిబట్టలతో నిలచినవాడలా ఒణుకు వచ్చింది.

"ఎందుకింత ఆలస్యంగా వచ్చావు?"

"చెమించాలి."

"అమ్మగారు కారణం అడుగుతూంటే 'ఇదీ' అని చెప్పక మన్నించాలి, చమించాలి ఏంటిరా పిచ్చోడా! ఎందుకాలీసం అయిందో అమ్మగారితో మనవి చేసుకో" భుజం తట్టి ధైర్యం చెప్పాడు బేరర్.

"మా ఇంటిది బజారుపోయింది. తిరిగొచ్చేతలికి ఆలీసం అయిపోనాది. బొట్టిడు బొత్తిగా సిన్నోడు, ఇంటికాడ ఒగ్గేసి రానేక..."

మనవాళ్లయ్య చెప్పిన విషయం కాక, బెక్కుతూ బెదురుతూ ఆ చెప్తున్న తీరు చూస్తే కోపం పోయి నవ్వు వచ్చింది సర్వ మంగళకి.

"మీ ఇంటిది బజారెల్లి ఏం కొన్నది? అతడిచేత మరికాస్తసేపు మాట్లాడించి ఆ విధంగానైనా మనసు చులకన చేసుకోవాలని చిన్నగానవ్వుతూ ప్రశ్నించింది.

అమ్మగారు అలా నవ్వుతూ అడగడంతో మనవాళ్లయ్య మనసు కుదుటపడింది. కష్ట సుఖం చెప్పుకోవచ్చు అనే ధైర్యం కలిగింది.

"మొన్న తవరిచ్చినారు గదా దీపావళికి బట్టలు కొనుక్కోరా మనవాళ్లూ అని. ఆ సొమ్మెట్టి... అది కాపరానికి వచ్చిన కాడినుండీ ఊరికీ చంబరపడి పోతున్నాదనీ...."

"నైలాన్ కోక కొనుక్కోమన్నావా?"

మాట మధ్యలోనే అడిగింది సర్వమంగళ. ఆడవాళ్లు సంబరపడేవి చీరలు, నగలే కద? ఆ సొమ్ముకి నగలు ఎలాగా రావు.

"కాదండమ్మగారూ! మా పొరుగింటి పొట్టాడి పెల్లాం కొనుక్కొందిట. మీ కాడ ఉద్యోగంలో సేరినకాడి నుండీ పేనం తినేత్తున్నాది, 'మావా మంచీల్లు తెచ్చుకోడానికి ఎల్లమ్మత్త కొన్ననాటి ఓ ఇత్తడి బిందె కొనెట్టు' అని. ఇంటిది అంతలా ముచ్చటడుతుంటే పండుగ్గై గుడ్డ ముక్కలు నేకపోతే నేకపోయేయని తవరిచ్చిన డబ్బు దాని సేతలలెట్టి నీ ఇట్టం వచ్చింది కొనుక్కురాయే అన్నా."

"ఎంతిచ్చి కొంది?"

"ముప్పయ్ రూపాయలు... ఈరోజుల్లో పెటీదీ సానా పిరిం" అన్నాడు మనవాళ్లు. 'ఇత్తడి బిందె ముప్పయి రూపాయలు' అనగానే బస్సులో అమ్మాయి గుర్తుకొచ్చింది ఆమెకి. ఆ పిల్లేనా మనవాళ్లయ్య పెళ్లాం? ఎలా తెలుస్తుంది? తనకి ఆ పిల్ల పేరైనా తెలియదే? మనసులో గింజుకొంది సర్వమంగళ.

"నీ కొడుకునీ, పెళ్లాన్నీ ఒకసారి తీసుకొచ్చి చూపించు" మాట ముగింపుకి యధాలాపంగా అన్నట్లు అంది.

అమ్మగారి ఆ మాటతో అతడు ఏనుగెక్కినంతగా పొంగిపోయాడు. దండిస్తుందను కొన్న యజమానురాలు అభిమానంగా పెళ్లాన్ని, పిల్లడిని చూస్తానంటున్నది. ఆ భృత్యుడికి అంతకన్నా ఆనందించవలసిన విషయం ఏముంటుంది?

"రేపు పిలుసుకొత్తానండమ్మా" వంగి దండం పెడుతూ అన్నాడు.

అన్నవిధంగా మరునాడు డ్యూటీలోకి వస్తూ భార్యనీ కొడుకునీ వెంట బెట్టుకొని వచ్చాడు. బస్సులో అమ్మాయే మనవాళ్లయ్య పెళ్లాం అని దూరం నుంచి చూస్తూనే పోల్చుకుంది సర్వమంగళ.

ముందురోజు కన్నా అందంగా ముస్తాబయింది ఆ పిల్ల. తన పెళ్లినాటిదేమో చిలక పట్టుచీర మడమల మీదికి కుచ్చిళ్లు జారాడేలా పొందిగ్గా కట్టుకొంది. దానికి జోడైన సిల్కు రవికె తొడుక్కుంది. కళ్లకి కాటుకా, నుదుటిపై నయాపైసంత గుండ్రని బొట్టూ. వాలుజడ, జడలో కనకాంబరాలు. పెద్ద అందగత్తె కాకపోయినా ఆకర్షణీయ మైన ముఖం ఆ పిల్లది. ఆమె చంకలో ఉన్న కొడుకు పాలబుగ్గలతో, తెల్లని పలువరసతో, చిన్న లాగూ జుబ్బాలతో చూడముచ్చటగా వున్నాడు. క్షణకాలం ఆ పిల్లడిమీంచి చూపు తిప్పుకోలేకపోయింది సర్వమంగళ.

"నీ పేరేమిటి?" ఆ పిల్లను చూస్తూ ప్రశ్నించింది సర్వమంగళ.

"మల్లి... మల్లమ్మ."

"నీ కొడుకు పేరో?"

"చింవాద్రి."

"ఎన్నేళ్ళేమిటి?"

"ఈ చంకురేత్తిరికి మూడెల్తాయి."

"అదృష్టవంతురాలివి. ముత్యంలా ఉన్నాడు నీ కొడుకు" మనసులో మాట దాచుకోలేకపోయింది.

"అంతా ఆళ్లయ్య పోలికే" గర్వంగా భర్తవంక, కొడుకు వంక చూసుకొంటూ అంది మల్లి.

కాస్తసేపు మల్లి పుట్టిల్లు, అత్తిల్లు సంగతులు అడిగి తెలుసుకొన్నాక, "మీ సింహాద్రిని నాకిచ్చేస్తావేంటి!" అంది నవ్వుతూ. సర్వమంగళ నవ్వుతాలకే ఆ మాట అన్నా నిజంగా ఇచ్చేస్తే ఎంత బాగుండును, అన్న ఆశ కూడా లేకపోలేదు.

"అమ్మగారు పిలుత్తున్నారు ఎల్తావేట్రా? వారు బిస్కత్తులు కొనిత్తారు" అంది మల్లి.

నిజంగా తల్లి తననికాని ఇచ్చేస్తుందేమో అన్నట్లు ఆమె పీకని రెండు చేతుల్తోను పట్టుకొని బుర్ర అడ్డంగా తిప్పాడు సింహాద్రి.

"నీకు ఆడుకోడానికి ఇన్ని బొమ్మలిత్తారు."

ఈసారి బుర్ర తిప్పడంతో పాటు ఏడుపు కూడా అందుకొన్నాడు.

ఈ ప్రపంచంలో ఉన్న సర్వ సంపదలు, సమస్త వస్తువులు ఒకవైపు వుంచి ఆ తల్లిని ఇంకోవైపు నిలిపి 'నీకేది కావాలంటే?' క్షణమైనా ఆలోచించకుండా 'అమ్మ' అంటూ తల్లి ఒడిలోకి దూరిపోయేలా ఉన్నాడు ఆ కుర్రాడు.

ఆ సంఘటనతో సర్వమంగళ మనసు చివుక్కుమన్నది.

"ఒద్దులే బాబూ! రావద్దులే, ఏడవకు. మీ అమ్మ దగ్గరే ఉండువుగాని" అంది రాని నవ్వు తెచ్చుకుంటూ.

ఆ మాట అంటూంటే ఆమె మనసులోకి ఒక ఆలోచన వచ్చింది. మనవాళ్లయ్యని కుటుంబంతో పాటు వచ్చి బంగళా వెనుకగా ఉన్న సర్వెంట్ క్వార్టర్స్‌లో ఉండమంటే? కొంత అలవాటు పడ్డాక సింహాద్రికి తన దగ్గర చనువు ఏర్పడవచ్చు. వాడితో కాలక్షేపం చేస్తూ ఈ ఒంటరితనాన్ని కొంతవరకైనా మరచిపోవచ్చు.

పెద్దవారి మనసుల్లోకి ఆలోచన రాకనే పోవాలిగాని వచ్చిందంటే అది కార్యరూపం దాల్చకుండా మిగిలిపోతుందా? మరునాటి ఉదయం పది గంటలకల్లా మనవాళ్లయ్య భార్యా పిల్లలతో వచ్చి సర్వెంట్ క్వార్టర్స్‌లో గృహప్రవేశం చేసాడు.

అన్నవిధంగా చమన్‌లాల్ రెండోనాటికి రాలేదు. తెల్లవారితే దీపావళి పండగ. అర్ధరాత్రి నుంచే పటాకీలు, తారాజువ్వలు "పండుగ వస్తున్నాది లెండహో" అంటూ నిద్రలో కూరుకుపోయిన మనుషుల్ని మేల్కొల్పుతున్నాయి. నిద్రపట్టని సర్వమంగళ కలతగా పక్కమీద ఇటు అటు దొర్లుతుంటే గణగణమని బెడ్‌రూమ్‌లో ఫోన్ మోగింది. బొంబాయి నుంచి ట్రంకాల్ అయి వుంటుంది. లేకుంటే ఈ వేళప్పుడు పైకి కనెక్షన్ ఇవ్వరు. అనుకొంటూ పక్కకి తిరిగి రిసీవర్ అందుకొంది.

ఆమె అనుకొన్నట్లు అది బొంబాయి నుండి వచ్చిన పిలుపే. చమన్‌లాల్ మాట్లాడుతున్నాడు. ఎంత ప్రయత్నించినా ముందురోజుకి రావడం పడలేదుట. ఆరోజు ఉదయం కేరవిల్‌లో తప్పక వస్తాడుట. అంచేత ఏర్పాట్లు కొంచెం చూడమనీ మిత్రులందరికీ మరోమారు గుర్తు చెయ్యమనే–

దీనికోసం అర్ధరాత్రి కొంప మునిగిపోయినట్లు ఫోన్ చెయ్యాలా? తను చెప్పకపోతే విందుకి పిల్చిన అతడి మిత్రుల్ని తిండి పెట్టకుండా తగిలేస్తుందనుకొన్నాడా? విసుగుతో రిసీవర్ పెట్టేసి టేబిల్ క్లాక్ వంక చూసింది.

ఆమె అనుకొన్నట్లు అప్పుడు అర్ధరాత్రి కాదు. అయిదు గంటలు దగ్గర కావస్తున్నది. దూరంగా పక్షుల కూతలు, పటాకీల చప్పుళ్లు, తెల్లవారుతున్నదంటూ ఒళ్లు విరుచుకొంటూ మేలుకొంటున్న పట్నం పోకడలు కలగలుపుగా వినిపిస్తున్నాయి. ఈ జీవితంలో కాలు పెట్టాక ఆపాటి చీకటి ఉండగా సర్వమంగళ లేచిన సమయాలే అరుదు. భళ్లున తెల్లవారి ఎర్రగా ఎండ కాస్తున్నా బరువైన వెల్వెట్ తెరల వెనక వారి గదిలో ఇంకా అర్ధరాత్రి లాగే ఉంటుంది. శేఖర్‌కి ఏదైనా ప్రత్యేక ప్రోగ్రాం ఉంటే తప్ప తొమ్మిది లోపున ఎప్పుడూ లేవడు. తను లేచి మాత్రం చేసేదేముందని తెల్లవారినా అలా పక్క మీద బద్ధకంగా పడి దొర్లడం అలవాటైపోయింది ఆమెకి.

ఆ రోజు పండుగ దినం. రోజల్లా పక్కమీదపడి దొర్లబుద్ధి కాలేదు సర్వమంగళకి. ఆ చిరుచలిలో గది తలుపు తీసుకొని బాల్కనీలోకి వచ్చింది. అటునుంచి అడుగులు వేస్తూ డాబా మీదికి వెళ్లింది. మంచుకి తడిసిన ప్రకృతి, ప్రియుడితో తొలిరాత్రి గడిపి, అప్పుడే తెల్లారిపోయిందా అని బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ పడకగది వదలి బైటికి వచ్చిన జవరాలిలా ఉంది.

గేటు దగ్గర మనవాళ్లయ్య చలికి ముడుచుకొని బల్లమీద కూర్చుని ఉన్నాడు. కళ్లాపి జల్లి ముగ్గులు పెడ్తున్న పనిమనిషి మంగాలు అతడితో ఏవో ఊసులు చెపుతున్నది.

అలా తిరుగుతూ ఇంటి వెనుకవైపుకి వచ్చింది. సర్వమంగళ సర్వెంట్ క్వార్టర్స్ ముందుగా చింతచెట్టు క్రింద మల్లి వాళ్ళ పొయ్యిమంట ఎగసన దోస్తున్నది. ఎదురుగా రాతి మీద కొత్త ఇత్తడి బిందె ఆ మంట వెలుగులో బంగారు భాండంలా మెరిసి పోతోంది. అప్పటికే తలంటి నీళ్లు పోసుకొన్న సింహాద్రి పొయ్యి మంటలో తల్లి అంటించి ఇచ్చిన కాకర పువ్వొత్తి పట్టుకొని దాని నుంచి రాలుతున్న ప్రతి రవ్వకి తన నోట ఒక ముత్యం రాలుస్తూ తల్లితో కబుర్లు చెపుతున్నాడు.

దర్వాన్‌కి డ్యూటీ అప్పజెప్పి మనవాళ్లయ్య ఇంటికి వచ్చాడు.

"ఈయేలైనా కూంత పెందిలికాడే రానేకపోయావా? గంటై నీల్లు సలసల కాగి పోతన్నయ్" అంది మల్లి మొగుడు అందిస్తున్న చొక్కా అందుకుంటూ.

"నేను రాకపోతే నువ్వు తానం సేసేనేకపోనావా?" అన్నాడు మనవాళ్లయ్య తలంటుకి తయారవుతూ.

"ఆ.... నీ తానానికి ముందల నాను తానం సెత్తే సేసినట్టే" అంది మల్లి మూతి అదోలా తిప్పుతూ.

మల్లి అలా ఎందుకందో మనవాళ్లయ్య స్నానం చెయ్యడం చూసాక తెలిసింది సర్వమంగళకి. తలంటి నీళ్ళు పోసుకోడానికి చిన్నపిల్లడికంటే అన్యాయంగా అల్లరి పెట్టాడు మనవాళ్లయ్య. నీళ్లు కాస్త వేడయితే వేడని గోల, చల్లగా వుంటే చలి అని గునుపు, నాలుగు చెంబులు దబదబ పోస్తే ఊపిరి ఆడలేదనీ, కళ్ళల్లో పుల్ల జారిందనీ, ఇదనీ, అదనీ ఒకటే ఆగడం చేసాడు. అతని స్నానం పూర్తయ్యేసరికి మల్లి చీర, ఒళ్ళు పూర్తిగా తడిసిపోయాయి. తుండుగుడ్డతో తల తుడిచి, నడ్డి ఒత్తి 'ఇంక నే' అంది మల్లి.

"ఇదో ఓలే.... నీకు పండుగ బగుమానం తెచ్చి మరసేపోనా" అన్నాడు మనవాళ్లయ్య బట్టలు వేసుకుంటూ.

"ఏటది? ఏటి తెచ్చినావు" అంటూ ఉత్సాహంగా దగ్గరకి వచ్చింది మల్లి.

"సీకట్లో అంతదూరం నుంచి కనిపిత్తదేటి? దగ్గిలకొచ్చి సూడు" అన్నాడు మనవాళ్లయ్య కొంటెగా చేయి తిప్పుతూ.

"ఏదీ సూపెట్టు?" మరి కాస్త దగ్గిర కొచ్చింది మల్లి.

తడిసిన బట్టల్లో ఉన్న మల్లి ఆ చిరు వెలుగులో ఎవరో నేర్పరియైన శిల్పి చెక్కిన నల్లరాతి బొమ్మలా వుంది. అతి దగ్గరగా వచ్చిన ఆమెని హటాత్తుగా గుండెల మీదికి లాక్కొని రెండు చేతులతోనూ బంధించి, పెదవులపై ఉత్సాహంగా ముద్దుల వర్షం కురిపించాడు మనవాళ్లయ్య.

"సీ....పో... మావా! తెల్లారిపోనాది. ఏరైనా సూడగల్రు" అంటూ సిగ్గుతో కూడిన చిరుకోపంతో అతడిని పక్కకి నెట్టింది మల్లి.

మల్లిలాగే సూర్యుడు ముఖం ఎర్రగా చేసుకొని తూర్పుదిశ నుంచి పైపైకి వస్తున్నాడు. డాబా దిగి కిందికి వెళ్లింది సర్వమంగళ.

"అమ్మగారు ఈ రోజు వేగిరం లేచిపోయారు" అంది వంటావిడ కాఫీ కప్పు అందిస్తూ.

"అవును. ఈరోజు ఇంట్లో విందు ఉంది కదా? సేట్‌గారు పదకొండుకల్లా వస్తారు. ఏర్పాట్లన్నీ సరిగా ఉన్నాయా?"

"మేనేజరుబాబు అన్నీ సిద్ధం చేసే ఉంచారమ్మా" అప్పుడే డ్యూటీలోకి వచ్చిన బేరర్ జవాబు చెప్పాడు.

ఆరోజు బొంబాయి ఫ్లైయిట్ వాతావరణం సరిగా లేనందున రెండు గంటలు ఆలస్యంగా వచ్చింది. అప్పటికే అతిథులంతా వచ్చేశారు.

"సారీ! మీరు వచ్చేసరికి ఇంట్లో లేకుండా అయింది" అన్నాడు చమన్‌లాల్ మిత్రుల్ని పలకరిస్తూ.

"ఫరవాలేదు. మీరులేని కొరత మీ శ్రీమతి కనిపించనియ్యలేదు" అన్నారు అతిథులు.

భోజనాలు పూర్తయి అతిథులంతా వెళ్లిపోయేసరికి మూడు గంటలయింది. కొంచెం సేపు విశ్రాంతి తీసుకొని బంధుమిత్రుల ఇళ్ళకి దీపావళి శుభాకాంక్షలు తెలిపి రావడానికి

భార్యాభర్తలిద్దరూ బయలుదేరారు. సాయంకాలం ఆరు గంటలయేవరకు సేట్‌తోపాటు తనూ తిరిగింది సర్వమంగళ.

"పొద్దుపోతోంది. పూజ ఏర్పాట్లు చూడాలి. నేను ఇంటికి వెళతాను" అంది.

"త్రిపాఠీలని చూసి ఇద్దరం కలిసే వెళ్లిపోదాం" అన్నాడు చమన్‌లాల్.

"మీరు వెళ్లిరండి, మిసెస్ త్రిపాఠి ఊళ్లో లేదుకదా?"

"నీ ఇష్టం" అన్నాడు సేట్.

దీపాలు పెట్టినా సేట్ ఇంటికి రాలేదు. త్రిపాఠి ఇంటికి ఫోన్ చేస్తే, "అయ్యగారూ, సేట్‌గారూ కలిసి ఎక్కడికో వెళ్లారు" అన్నాడు ఇంట్లో నౌకరు.

సర్వమంగళ పూజ పూర్తిచేసుకుని బయటికి వచ్చేసరికి ఫోను మోగుతున్నది. అటునుంచి చమన్‌లాల్ కంఠం ఉత్సాహంగా విన్పించింది.

"ఇక్కడ సహానీ ఇంట్లో 'దివాలీలక్'లో చిక్కడిపోయాను. నీ పూజ పూర్తి అయిపోతే నువ్వు కూడా వచ్చేయ్. మిసెస్ సహానీ కూడా ఆటలో కూర్చుంది" అన్నాడు.

"నేను రాను" విసురుగా రిసీవర్ పెట్టేసింది సర్వమంగళ.

ఇంటి చుట్టూ తోటలో చెట్లకి, పొదలకి రంగురంగుల ఎలక్ట్రిక్ దీపాలు అమర్చారు. బంగళాకి నాలుగు వైపులా బారులు తీర్చి కొవ్వొత్తులు వెలిగించారు. మేనేజరు దగ్గర వుండి పనివాళ్లచేత బాణాసంచా కాలిపించాడు.

పై అంతస్తు బాల్కనీలో నిలబడి చుట్టూ చూసింది సర్వమంగళ. ఊరు ఊరంతా ముత్యాల బారుల్లా ఉన్న దీపాలతో మిలమిల మెరిసిపోతోంది. ఒక్కసారి కిందుగా తమ ఇంటివైపు చూసుకొంది. ఇంటినిండా దీపాలు వెలుగుతున్నా వాటిపక్కనే కారు చీకటి అలముకొన్నట్లు అనిపించింది.

ఆ రోజు మనవాళ్లయ్యకి ఆఫ్ డ్యూటీ. ఇంకొక చౌకీదార్ గేటు దగ్గర ఉన్నాడు. ఉదయం చూసిన దృశ్యం ఆమె కళ్ళముందు తిరిగింది. మల్లి, మనవాళ్లయ్య ఎలా పండుగ చేసుకుంటున్నారో చూడాలనిపించింది. కుతూహలంగా పెరటివేపు డాబా మీదికి వెళ్లింది.

మల్లి తమ యింటి ముందు కళ్ళాపిజల్లి ముగ్గులు పెట్టింది. ముగ్గుకి మధ్యగా మూడు మట్టి ప్రమిదల్లో దీపాలు పెట్టింది. అవి ఆరిపోకుండా ఉండుండి వాటిలో నూనె పోస్తూ వత్తులు ఎగసన దోస్తోంది. సింవాద్రి కాసేపు తల్లి కొంగు పట్టుకొని తిరిగి నిద్రకి జోగిపోయాడు. ఇంట్లో మంచం మీద సింవాద్రిని పడుకోబెట్టి మల్లి తిరిగి వచ్చింది.

ముంగిట దీపాల ముందు కన్నార్పకుండా వాటినే చూస్తూ కూర్చుంది మల్లి.

"మూడు దీపాలకే ఇంతనా మురిసిపోతన్నవ్. అటుసూడు, అమ్మగారి యిల్లు దీపాలతో ఎలా మెరసి పోతందో?" అన్నాడు మనవాళ్లయ్య.

"అరికి మనకి సాటేటి? మన శక్తికి తగ్గట్టు మనం నడుసుకోవాలి. మనం ముగ్గురం గందా... అందుకే మూడు దీపాలెట్టినాను. ఇది నువ్వు, ఇది నాను, ఇది చింవాద్రి" అంది మల్లి ఉత్సాహంగా.

"మరి ఈడికో" అన్నాడు మనవాళ్లు మల్లి పొట్ట వంక చూపిస్తూ.

ఆ రోజు ఉదయం వంటావిడకి పనిలో సాయంచేస్తూ మల్లి ఒకటి రెండుసార్లు బయటికి వెళ్లి వాంతి పోసుకోవడం సర్వమంగళకి గుర్తొచ్చింది.

"ఏమిటే మల్లీ... మల్లీ ఏదైనా..." అంది వంటావిడ నవ్వుతూ.

"ఏటినేదమ్మగారూ. కాంత పైత్యం చేసింది" అంది మల్లి.

"సీ పో మావా!" సిగ్గుతో మల్లి ముఖం తిప్పుకొంది.

"యాడకి పోయినా నిన్నొదిలి పోతానేటి? ఇలా చేతులకి ఎత్తుకొని, గుండెలకి అత్తుకొని..." అంటూ అమాంతం మల్లిని చేతులతో పైకెత్తి గుండెలకి అదుముకొన్నాడు మనవాళ్లయ్య.

మల్లి వెలిగించిన దీపాలు ఆరిపోయాయి. సర్వమంగళ కట్టిన పల్చటి కాశ్మీర్ సిల్కు చీర మంచుకి తడిసి ముద్దయి వంటికి అంటుకుపోయింది. ఇంట్లో పనివాళ్ల సందడి తగ్గింది. నైట్ వాచర్ గేటుకి తాళంపెట్టి కుర్చీలో కూర్చుని కునుకుపోతున్నాడు. పోర్టికోలో నల్లకారు దీపాల కాంతిలో నిగనిగా మెరసిపోతోంది.

సేట్ వచ్చాడన్నమాట. ఎప్పుడు వచ్చాడో? పడక గదిలోకి వచ్చింది సర్వమంగళ. గదిలో నీలం లైటు నిశ్చలంగా వెలుగుతోంది. సాయంకాలం వేసుకున్న బట్టలైనా విడువకుండా కొండ చిలువలా మంచం మీదపడి నిద్రపోతున్నాడు సేట్. పెద్దగా తెరచిన నోటిలోంచి గురక, దానితోపాటు విస్కీ వాసన గది నాలుగు మూలలా నిండిపోతోంది. ఆ గురకకి లయబద్ధకంగా ఖరీదయిన షర్టు కింద ఎగిరెగిరి పడుతోంది పెద్ద బొజ్జ. ఎత్తుగా ఉబ్బి ఉన్న కోటు జేబులోంచి అతడి 'దివాలీలకీ' వంద రూపాయల నోట్ల రూపంలో తొంగిచూస్తోంది. సేట్ మొదటి భార్య నిద్ర మాత్రలు మింగి ఎందుకు చచ్చిపోయిందో ఆ క్షణంలో అర్థమయింది ఆమెకి. ఎదురుగా ఉన్న అద్దంలో తన రూపు చూసుకుంది. వేకువ సమయంలో తోటలో మంచుకి తడసిన అరవిచ్చిన గులాబి గుర్తుకు వచ్చింది.

ఆ పండుగనాటి రాత్రి ఆమె కంటి మీద రెప్ప వాలలేదు. ఆ రోజే కాదు, అటు తరువాత మూడు రోజులపాటు ఆమె నిద్రకి నోచుకోలేదు.

నాలుగోనాడు ఉదయం....

నాలుగోనాడు ఉదయం సేట్ చమన్‌లాల్ గారి గుమాస్తా మనవాళ్లయ్యను ఆఫీసు గదిలోకి పిలిచి, ఆరోజు వరకు అతడికి రావలసిన జీతం లెక్కకట్టి చేతిలో పెట్టారు.

"అమ్మగారి మనసు దొడ్డది.... ఇదిగో ఇంకో నెల జీతం కూడా పట్టుకుపో" అన్నాడు నోట్లు లెక్కించి బల్లపై పెడుతూ.

బల్లమీది సొమ్ముని బల్లవెనుక గుమాస్తాని మతిపోయినవాడిలా మార్చి మార్చి చూసాడు మనవాళ్లయ్య.

"ఏంటిరా అలా చూస్తావు? నీకు పని దొరికేదాకా తిండి తిప్పలకి ధోకా లేకుండా అప్పనంగా నెల జీతం ముట్టజెప్తే?"

"అంటే... అంటే....."

"అంటే ఈ రోజు నుండి ఇక్కడ పనిలేదు."

"నేనేటి తప్పు సేసేను బాబయ్యా! ఏలకి డూటీనోకి రానేదా? రాత్తిరేల కునికి పోనానా?"

"అదంతా నాకు తెలియదు, వారు చెప్పారు. నేను చేశాను. ఏదయినా చెప్పుకోవాలనుకుంటే అయ్యగారితోనో, అమ్మగారితోనో చెప్పుకో" అన్నాడు గుమాస్తా. మనవాళ్లయ్యను ఆవిధంగా అకస్మాత్తుగా పనిలోంచి తప్పించడం అతడికీ ఇష్టం లేదు. ఈరోజు వీడు అయ్యాడు, రేపు తను కావచ్చు.

అయ్యగారి కాళ్ళమీద పడ్డాడు మనవాళ్లయ్య.

"చూడు మనవాళ్లూ! నిన్ను పనిలో పెట్టింది అమ్మగారు. ఎందుకు పొమ్మన్నారో ఆమెనే అడుగు. ఈ విషయంలో నేనేం చెయ్యలేను" అన్నాడు సేట్. ఎంతో నమ్మకంగా భయభక్తులతో పనిచేసే ఆ భృత్యుడ్ని యజమానురాలు ఎందుకు పొమ్మందో అతడికే అర్థం కాలేదు.

సాయంకాలందాకా నిరీక్షించినా అమ్మగారి దర్శనం కాలేదు. మనవాళ్లయ్య మనవి నందుకొని లోపలికి వెళ్లిన దాసీది అంతలోనే తిరిగివచ్చి, "అమ్మగారికి ఒంట్లో బాగాలేదు, ఎవర్నీ చూడనన్నారు" అంది.

ఆ రాత్రి తెల్లవారింది. నిద్రలేక మండుతున్న కళ్ళతో గేటు వైపు చూసింది సర్వ మంగళ. కొత్త చౌకీదారు గేటు తలుపులు తీసి పట్టుకున్నాడు. రెండు రిక్షాలు గేటు లోంచి బయటికి వెళుతున్నాయి. ఒకదానిలో మనవాళ్లయ్య కాళ్ల దగ్గిర కర్ర పెట్టె, పక్కచుట్ట, ఇంకోదానిలో మల్లి ఒడిలో సింహాద్రి, కాళ్ళదగ్గర ఇత్తడి బిందె. అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడి కాంతిలో తళతళ మెరిసిపోతోంది బిందె. కాని బస్సులో ఇత్తడి బిందె అమ్మాయి ముఖంలో ఉన్న ఉత్సాహం, ఆనందం ఈనాడు మల్లి ముఖంలో మచ్చుకి కూడా లేవు. తల్లిదండ్రుల బాధలు తెలియని సింహాద్రి మాత్రం రిక్షా ఎక్కానన్న సంబరంతో కిలకిల నవ్వుతున్నాడు.

పల్చటి కిటికీ తెర వెనుకగా నిలచి ఈ దృశ్యాన్ని చూసిన సర్వమంగళ ఆ రిక్షాలు దూరం కావడంతో గట్టిగా నిట్టూర్చింది. ఆ నిట్టూర్పుతో ఆమె మనసులో బరువు తేలికపడిందో లేక బలపడిందో ఆ మనసుకే తెలియాలి.